నమస్తే తెలంగాణ

# ఖమ్మం

5 | ఖమ్మం, శుక్రవారం 5 ఏప్రిల్ 2024 | KHAMMAM




ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

# వంద రోజుల్లోనే పాలన గాడి తప్పింది

- రాష్ట్రంలో 15 లక్షల ఎకరాల పంట దెబ్బతిన్నది
- కాంగ్రెస్ పాలనలో సకల జనులు ఇబ్బంది పడుతున్నారు
- కాంగ్రెస్ మాయమాటలు, మోసపూరిత హామీలను ఎండగట్టండి
- పార్లమెంటులో తెలంగాణ అభివృద్ధిని చాటింది బీఆర్ఎస్ ఎంపీలే..
- కేంద్రం నుంచి రూ.2,653 కోట్ల నిధులు తీసుకువచ్చాం
- పార్లమెంటులో గళమెత్తాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలి
- ఎంపీ నామా నాగేశ్వరరావు

అశ్వారావుపేట టౌన్/అశ్వారావుపేట, ఏప్రిల్ 4 : గ్రామం బాగుంటేనే గ్రామంలోని ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారనేది నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నినాదం. అందుకు తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ పదేళ్ల పాలనలో గ్రామాల్లోని చెరువులను పునరుద్ధరించి ప్రాజెక్టులను కట్టించి సాగు, తాగు నీటికి ఇబ్బంది లేకుండా పాలన సాగించిన మహనీయుడు కేసీఆర్ అని ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల మోసపూరిత మాటలను ప్రజలు నమ్మి ఓటు వేస్తే పాలన సాగించి నాలుగు నెలలు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలు కాంగ్రెస్ పాలనపై మండిపడుతున్నారు. గురువారం అశ్వారావుపేట మండలస్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అధ్యక్షతన పట్టణ సమీపంలో జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎంపీ నామా మాట్లాడుతూ.. రాష్ట్రంలో సాగునీటి సమస్యతో 15 లక్షల ఎకరాలలో పంట దెబ్బతిన్నదని, అందుకు లెక్కలతో సహా పార్టీ వెల్లడించడం జరిగిందన్నారు. వందరోజుల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని సకల జనులు ఇబ్బందులు పడ్డారని యన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ అవలంబిస్తున్న మోసపూరిత పాలనపై పార్లమెంటులో గళమెత్తాల్సిన అవసరం ఉన్నదని, అందుకు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఖమ్మం పార్లమెంటు అభ్యర్థిగా మరోమారు పోటీచేసే అవకాశం అందించిన కేసీఆర్ నమ్మకాన్ని నిలబెట్టేందుకు కార్యకర్తలు కష్టపడి పనిచేసి రెండు లక్షల ఓట్ల మెజార్టీతో గెలిపించాలన్నారు. స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో అభివృద్ధి పరుగులు తీసిందని ఒక్క ఖమ్మం జిల్లాకు ఎంపీగా నేను కేంద్రం నుంచి రూ.2,635 కోట్లు నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేశామన్నారు. కొవ్వూరు- భద్రాచలం రైల్వే లైన్ మంజూరులోనూ, జిల్లాలోని నేషనల్ హైవే రోడ్లు ముద్ర బీఆర్ఆర్, నామా ముద్రేనని సగర్వంగా చెప్పుకుంటున్నానని అన్నారు. తెలంగాణలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవని కానీ ఈ మోసపూరిత కాంగ్రెస్ పాలనలోని కొద్ది రోజులకే ప్రజా పాలన అస్తవ్యస్తంగా మారిందని దుయ్యబట్టారు. మళ్ళీ పార్లమెంటు ఎలక్షన్ల పేరుతో ప్రజలకు మాయ మాటలు చెప్పి మొండి చేయి చూపించేందుకు వస్తారని.. ఇంకా ఎన్నికలు చాలా ఉన్నాయని గెలిచేది.. వచ్చేది బీఆర్ఎస్ పార్టీఏనని కాంగ్రెస్ కార్యకర్తల బెదిరింపులకు, కేసులకు బయపడేది లేదని ప్రతి కార్యకర్తకు నేను, మన పార్టీ అండగా ఉంటుందని అభయమిచ్చారు. సమావేశంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, జట్పీటీసీ చిన్నంశెట్టి వరలక్ష్మీ, వైస్ ఎంపీపీ చిట్టూరి ఫణీంద్ర, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సత్యవరపు సంపూర్ణ, నాయకులు వెంన్నబాబు, గారపాటి సూర్యనారాయణ, నారం రాజశేఖర్, ఎంపీటీసీలు లలిత, నాగలక్ష్మీ, పండా రాజు, పాయం రమేశ్, పద్దం కుమారి, జేకేవీ రమణారావు, మందపాటి మోహన్‌రెడ్డి, సంకా ప్రసాద్, కాసాని చంద్రశేఖర్, సాదు జ్యోష్నాబాయ్, మోటూరి మోహన్ పాల్గొన్నారు.



- టార్గెట్‌ను మించి ఆదాయం సొంతం
- మద్దులపల్లి మినహా అన్ని మార్కెట్లు అదే జోరు
- జిల్లా మార్కెటింగ్‌శాఖ లక్ష్యం రూ.54.39 కోట్లు
- సాధించిన ఆదాయం రూ.57.80 కోట్లు

# ఖమ్మం ఏఎంసీపై కాసుల వర్షం



రైతులు తీసుకొచ్చిన మిర్చిబస్తాలు (ఫైల్)

ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 4 : ప్రతికూల పరిస్థితిలోనూ ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ప్రగతిపథంలో దూసుకుపోతున్నది. ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యాన్ని మించిన ఆదాయం సాధించి రికార్డు సృష్టించింది. పత్తి, అపరాల పంటల దిగుబడి ఈ ఏడాది ఆశించిన మేర రాకపోయినప్పటికీ, గత ఏడాది కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వలు పూర్తిగా లేకున్నప్పటికీ రికార్డుస్థాయిలో ఆదాయం సొంతం చేసుకోవడం విశేషం. సీజన్ ఆరంభంలో మిర్చిపంటకు మంచి ధర రావడంతో మార్కెట్‌కు భారీగా ఆదాయం సమకూరింది. లక్ష్యాన్ని మించి ఆదాయం రావడానికి ఇదే ప్రధాన కారణంగా చెప్పవచ్చు. దీనికితోడు ఖరీదుదారులు సైతం మార్కెట్ ఫీజు సకాలంలో చెల్లించడంతో మార్గం సుగమం అయ్యింది. ఈ సంవత్సరం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రూ.26.14 కోట్లను రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ టార్గెట్ విధించింది. దీంతో ఈ సంవత్సరం మార్చి 31నాటికి రూ.27.61 కోట్ల ఆదాయం సొంతం చేసుకుంది. 2022-23 సంవత్సరం ఇదే మార్కెట్ లక్ష్యం రూ.25.27 కోట్లు కాగా రూ.26.07 కోట్లను సొంతం చేసుకుంది. ఈ సంవత్సరం సుమారుగా 12 లక్షల మిర్చిబస్తాలు కోల్డ్ స్టోరేజీలకు వెళ్లినప్పటికీ టార్గెట్‌ను మించి రూ.1.50 లక్షల వరకు అదనంగా ఆదాయం సొంతం చేసుకోవడంతో మార్కెట్ కమిటీ అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఏడు మార్కెట్లు సూపర్ సక్సెస్

జిల్లా మార్కెటింగ్‌శాఖ పరిధిలో ప్రస్తుతం 8 వ్యవసాయ మార్కెట్లు అందుబాటులో ఉన్నాయి. 2023-24 సంవత్సరానికి గాను రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ జిల్లా మార్కెటింగ్‌శాఖకు రూ.54.39 కోట్ల లక్ష్యం పెట్టింది. అందుకు అనుగుణంగానే మార్చి 31నాటికి జిల్లా మార్కెటింగ్‌శాఖకు రూ.57.80 కోట్ల ఆదాయం రావడంతో టార్గెట్‌ను మించి ఆదాయం సొంతం చేసుకున్నట్లైంది. మార్కెట్లవారీగా ఆదాయాలు పరిశీలిస్తే.. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ టార్గెట్ రూ.26.14 కోట్లు కాగా రూ.27.61 కోట్లు సొంతం చేసుకుంది. మధిర వ్యవసాయ మార్కెట్ టార్గెట్ రూ.4.34 కోట్లు కాగా రూ.4.55 కోట్లు, నేలకొండపల్లి టార్గెట్ రూ.4.05 కోట్లు కాగా రూ.3.91 కోట్ల ఆదాయం సమకూరింది. కల్లూరు టార్గెట్ రూ.4.17 కోట్లు కాగా రూ.4.84 కోట్లు, వైరా టార్గెట్ రూ.4.72 కోట్లు కాగా రూ.5.78 కోట్లు, ఏన్కూర్ లక్ష్యం రూ.4.14 కోట్లు కాగా రూ.4.49 కోట్లు. సత్తుపల్లి లక్ష్యం రూ.3.75 కోట్లు కాగా రూ.4.78 కోట్లు ఆదాయం వచ్చింది. అదేవిధంగా మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ లక్ష్యం రూ.3.08 కోట్లు కాగా రూ.1.82 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. సీసీఐ నుంచి రావాల్సిన ఆదాయం సమకూరితే మద్దులపల్లి మార్కెట్ సైతం లక్ష్యాన్ని చేధించే అవకాశం ఉంది. ఏదిఏమైనా 2023-24 సంవత్సరానికి గాను జిల్లా మార్కెటింగ్‌శాఖ పరిధిలోని అన్ని మార్కెట్లు మంచి పురోగతి సాధించడంతో మార్కెటింగ్‌శాఖ లక్ష్యాన్ని మంచి ఆదాయం అందుకున్నట్లైంది.

### సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు



ఖమ్మం వ్యవసాయ మార్కెట్ లక్ష్యానికి మించి ఆదాయం సొంతం చేసుకోవడం చాలా సంతోషంగా ఉంది. సకాలంలో మార్కెట్ ఫీజు చెల్లించిన ఖరీదుదారులు, కమిషన్ వ్యాపారులు, సహకరించిన ఉద్యోగులు, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు. మార్కెట్‌కు పంట తీసుకొచ్చే రైతులకు సకల వసతులు కల్పించి, మంచి ధర వచ్చేవిధంగా చూడడమే మా ప్రధాన లక్ష్యం.

– ప్రవీణ్‌కుమార్, ఖమ్మం ఏఎంసీ సెక్రటరీ

# భవిష్యత్ బీఆర్ఎస్‌దే..

- పార్టీని వీడిన నేతలు పశ్చాత్తాపపడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి
- నేను ఎప్పటికీ కేసీఆర్ వేలు విడిచిపెట్టను
- ఆయన అడుగుజాడలే శ్రీరామరక్ష
- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయదుందుభి ఖాయం
- 'నమస్తే తెలంగాణ'తో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర



ఖమ్మం, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌ను, అధినేత కేసీఆర్‌ను వీడిన నేతలు పశ్చాత్తాప్పపడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల అండతో బీఆర్ఎస్ పార్టీ తిరుగులేని రాజకీయశక్తిగా ప్రజల హృదయాల్లో నిలవనుందని అన్నారు. తనను సొంతబిడ్డలా చూసుకుంటూ అద్భుతమైన రాజకీయ అవకాశాలు ఇచ్చిన పార్టీ అధినేత కేసీఆర్‌కు జీవితకాలమంతా రుణపడి ఉంటానని స్పష్టం చేశారు. బీసీలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చే పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని తేల్చిచెప్పారు. కాగా, బీఆర్ఎస్ పార్టీ రాజ్యసభ సభ్యుడిగా గురువారం ఢిల్లీలో ఆయన రెండో దఫా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే రాజ్యసభ సభ్యుడిగా రాష్ట్రాభివృద్ధికి, పార్టీ పటిష్టతకు చేయాల్సిన కృషిపై ఆయన 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో మాట్లాడారు.

**నమస్తే తెలంగాణ :** రాజ్యసభ సభ్యుడిగా మీ ప్రాధాన్యాలేంటి?

**వద్దిరాజు :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆశీస్సులతో రెండోసారి కూడా రాజ్యసభకు వెళ్లడం ఆనందంగా ఉంది. మొదటిసారి రాజ్యసభ సభ్యుడిగా 20 నెలలపాటు గడించిన అనుభవం భవిష్యత్ పోరాటానికి ఉపయోగిస్తుంది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కేంద్రం నుంచి రావాల్సిన వాటిని తెచ్చేందుకు కృషిచేయడమే నా ప్రథమ కర్తవ్యం. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడానికి, కేంద్ర పథకాల ద్వారా నిధులు సాధించడానికి నిరంతరం శ్రమిస్తా.

**నమస్తే :** కేంద్రం పరిష్కరించాల్సిన ప్రధాన సమస్యలేమిటి?

**వద్దిరాజు :** రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన అనేక హామీలను కేంద్రం తుంగలో తొక్కింది. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం వంటి ప్రధాన సమస్యలు దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోలేదు. వచ్చే ఆరేళ్లలో కేంద్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ పక్షాన ఒత్తిడి తెచ్చి వాటిని నెరవేర్చి వేలాదిమందికి ఉపాధి కల్పించేలా ప్రణాళిక రూపొందించి పోరాడుతాం.

**నమస్తే :** పారిశ్రామిక ప్రగతికి కేంద్రం ద్వారా చేసే కృషి ఏమిటి?

**వద్దిరాజు :** అభివృద్ధి జరుగుతున్న తెలంగాణలో జలరవాణాకు అవకాశం లేకపోవడంతో తెలంగాణ రాష్ట్ర నలుమూలల డ్రైపోర్టులను ఏర్పాటు చేయాలన్నది నా ఆకాంక్ష. దీనిపై 20 నెలల పదవీకాలంలో కేంద్ర ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు చేశా. వివిధ రూపాల్లో డ్రైపోర్టుల అవసరాన్ని తెలియచేశా. భవిష్యత్‌లో వీటి సాధన కోసం రాజ్యసభ, లోక్‌సభల్లో బీఆర్ఎస్ ఎంపీలు గళమెత్తుతారు.

**నమస్తే :** ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం కార్యాచరణ ఏమిటి?

**వద్దిరాజు :** బీఆర్ఎస్ అంటే బలహీన, బడుగు వర్గాల, మైనార్టీల పార్టీ. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం వారి అభివృద్ధికి ఆయన ప్రభుత్వం నిరంతరం శ్రమించింది. శాసనసభ ఎన్నికల ఫలితాలు కొంత భిన్నంగా ఉన్నా లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌కు అండగా ఉండేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజలకు ఏంకావాలో, గత ప్రభుత్వం చేసిన సంక్షేమ కార్యక్రమాలు ఏమిటో ఇంటింటికీ వెళ్లి చెప్పేందుకు బీఆర్ఎస్ సైన్యం సిద్ధమవుతోంది.

**నమస్తే :** రెండోసారి రాజ్యసభ అవకాశం పై మీ స్పందన?

**వద్దిరాజు :** రాజ్యసభ సభ్యుడిగా తనకు రెండోసారి అవకాశం ఇవ్వడం తండ్రిలాంటి కేసీఆర్‌కు మాత్రమే సాధ్యమైంది. తనకు ఈ స్థానం ఇవ్వడం ద్వారా బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలలను కేసీఆర్ కడుపులో పెట్టుకుని చూసుకుంటారన్న విషయాన్ని, వారి కోసం బీఆర్ఎస్ పార్టీ ఉందన్న సందేశాన్ని ప్రజలకు పంపించగలిగారు. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలన్నీ ఎప్పటికీ కేసీఆర్ వెంటే నడుస్తాయి.

**నమస్తే :** ఖమ్మం లోక్‌సభ స్థానంలో బీఆర్ఎస్ విజయం కోసం మీరు నిర్వహించే పాత్ర?

**వద్దిరాజు :** రాజకీయ చైతన్యం ఉన్న ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తా. ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గంలో పార్టీకి పూర్తి సానుకూల వాతావరణం ఉంది. ఎవరెన్ని వ్యూహాలు రూపొందించినా ఇక్కడ అంతిమ విజయం బీఆర్ఎస్‌దే. గతంలో గెలిచినట్లుగా భారీ మెజార్టీతో మళ్లీ గెలుస్తాం. విజయదుందుభి ఖాయం.

**నమస్తే :** మీ భవిష్యత్ కార్యాచరణ ఏమిటి?

**వద్దిరాజు :** రాజ్యసభ సభ్యుడిగా రెండుసార్లు అవకాశమిచ్చిన కేసీఆర్‌కు కృతజ్ఞతగా ఉండటం, పార్టీ పురోభివృద్ధికి సైనికుడిలా కష్టపడటం నా తక్షణ కర్తవ్యం. ఎన్ని అవాంతరాలు ఎదురైనా కేసీఆర్ వేలు విడిచిపెట్టేదిలేదు. బీఆర్ఎస్‌ను రాష్ట్రంలో మరోసారి అధికారంలోకి తీసుకురావడమే నా అంతిమ లక్ష్యం. ఇదే నా కార్యాచరణ.

# రాజ్యసభ సభ్యుడిగా వద్దిరాజు ప్రమాణస్వీకారం

ఖమ్మం, ఏప్రిల్ 4: రాజ్యసభ సభ్యుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్ర గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ఢిల్లీలో పార్లమెంట్ ప్రాంగణంలో గురువారం ఉదయం ఆయన చేత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధనఖర్ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ధనఖర్, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి పీయూష్ గోయల్, రాజ్యసభ సభ్యులు పలువురు రవిచంద్రకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వద్దిరాజు రవిచంద్ర తన కుటుంబ సభ్యులతో పాటు వెళ్లి ఉపరాష్ట్రపతి సహా ఇతర ప్రముఖులను కలిశారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న వద్దిరాజు

# పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి

ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్



కల్లూరు హనుమాతండా ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

సత్తుపల్లి, ఏప్రిల్ 4 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఖమ్మం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. గురువారం ఆయన పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి కల్లూరు మండలంలోని హనుమాతండా ప్రాథమికోన్నత పాఠశాల, కవాలిగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పేరువంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముగ్గువెంకటాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, రన్నింగ్ వాటర్‌తో టాయిలెట్ తదితర అన్ని సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంపౌండ్ వాల్ లేని పోలింగ్ కేంద్రాల పాఠశాలలకు కాంపౌండ్ వాల్ లేదా పెన్సింగ్‌ను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఫ్యాన్లు, లైట్లు ఉండేలా ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, శిక్షణ ఐపీఎస్ పి.మౌనిక, పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## చెక్‌పోస్టుల వద్ద పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలి..

సత్తుపల్లి, ఏప్రిల్ 4 : చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా చర్యలు చేపట్టి విస్తృత తనిఖీలు నిర్వహించాలని, నగదు, మద్యం రవాణాను నియంత్రించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. గురువారం కల్లూరు మండలంలోని పేరువంచ వద్ద ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది విధుల నిర్వహణ, ఎన్ని వాహనాలు తనిఖీ చేసింది అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అప్రమత్తంగా ఉంటూ 24 గంటలూ పటిష్ఠ నిఘా పెట్టాలని సూచించారు. అదనపు డీసీపీ ప్రసాదరావు, కల్లూరు ఏసీపీ అనిశెట్టి రఘు, తహశీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎస్సై షాకీర్ ఉన్నారు.

# ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ఓటరు అవగాహన ర్యాలీలో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక




ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలంటూ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో నిర్వహించిన రన్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక, చిత్రంలో డీడబ్ల్యూవో విజేత, ఐసీడీఎస్ అధికారులు

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక సూచించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బుధవారం కొత్తగూడెంలో నిర్వహించిన ఓటరు అవగాహన ర్యాలీని, రన్‌ను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' పేరిట జరిగిన ఈ ర్యాలీ పోస్టాఫీస్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ మీదుగా మార్కెట్ యార్డు వరకు సాగింది. ఈ సందర్భతంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశంలో ప్రతీ పౌరుడికీ సమాన విలువ కలిగిన ఓటు హక్కును రాజ్యాంగం మనకు కల్పించిందని అన్నారు. అలాంటి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలింగ్ శాతం పెంచాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. విద్యావంతులు కూడా ఓటు హక్కును వినియోగించుకోలేకపోవడం విచారకరమని అన్నారు. మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. 2024 ఏప్రిల్ 1 వరకు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈ నెల 15లోగా కొత్త ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, వృద్ధులు ఓటు వేసేలా ప్రోత్సాహం కల్పిస్తున్నామన్నారు. జిల్లా సంక్షేమ అధికారి వేల్పుల విజేత, డీఆర్‌డీవో విద్యాచందన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కట్టుదిట్టమైన భద్రత మధ్య.. పాలేరుకు సాగర్ జలాలు

- రిజర్వాయర్‌కు 3,100 క్యూసెక్కుల నీళ్లు
- గట్టెక్కనున్న వేసవి తాగునీటి గండం
- నాలుగు రోజులపాటు రానున్న కృష్ణా జలాలు



సాగర్ నుంచి వచ్చిన నీటిని పరిశీలిస్తున్న ఆర్డీవో గణేశ్, మిషన్ భగీరథ ఎస్ఈ శ్రీనివాస్, ఇరిగేషన్ ఈఈ మంగలపుడి, తహసీల్దార్ సురేశ్‌కుమార్

కూసుమంచి, ఏప్రిల్ 4: కట్టుదిట్టమైన భద్రత మధ్య సాగర్ జలాలు రావడమేంటని అనుకుంటున్నారా? నిజమే.. పాలేరు చుట్టూ రెండు జిల్లాల రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, మిషన్ భగీరథ శాఖల అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. కాలువపై పోలీసులు కాపలా ఉంటున్నారు. ఇరిగేషన్ సిబ్బంది గస్తీ కాస్తున్నారు. ఇంతటి కట్టుదిట్టమైన భద్రత నడుమ సోమవారం సాగర్‌లో వదిలిన కృష్ణా జలాలు గురువారం తెల్లవారుజామున 5 గంటలకు పాలేరుకు చేరుకున్నాయి. ఖమ్మం ఆర్డీవో గణేశ్ గురువారం తెల్లవారుజామున 4 గంటల నుంచి ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ మంగలపుడి వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఈఈ వాణిశ్రీ, ఏసీపీ తిరుపతిరెడ్డి, తహసీల్దార్ సురేశ్‌కుమార్ సంబంధిత శాఖల సిబ్బందితో కలిసి రంగుల బ్రిడ్జి వద్ద నీటికోసం వేచి ఉండగా సూర్యాపేట జిల్లా రెవెన్యూ, ఇరిగేషన్, మిషన్ భగీరథ, పోలీస్ అధికారులు జిల్లా సరిహద్దు వరకు నీరు వచ్చే దాకా ఉండి జిల్లా అధికారులతో చర్చించి వెళ్లారు. ఇలా గతంలో ఎన్నడూ లేని విధంగా సాగర్ జలాలను కట్టుదిట్టమైన భద్రత మధ్య పాలేరుకు సాగర్ జలాలను చేర్చారు. ఆర్డీవో గణేశ్ పర్యవేక్షణలో పలువురు అధికారులు పాలేరు చుట్టూ ఉన్న గ్రామాల్లోకి వెళ్లి ఎవరైనా నీటిని ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉందేమోనని, మోటర్ల ద్వారా నీటిని తోడే అవకాశం ఉందేమోనని పరిశీలించారు. కొన్ని సరిహద్దు గ్రామాలను ఆర్డీవో, ఈఈలు కూడా పరిశీలించారు.

## క్రమంగా పెరగనున్న పాలేరు..

సాగర్‌లో 4,900 క్యూసెక్కుల నీటిని వదలగా గురువారం తెల్లవారుజామున పాలేరుకు 1,000 క్యూసెక్కుల నీరు చేరుకుంది. క్రమంగా పెరిగి సాయంత్రానికి 3,100 క్యూసెక్కులు వస్తున్నాయి. గురువారం మధ్యాహ్నం నుంచి పాలేరు మట్టం క్రమంగా పెరగనుంది. 5.50 అడుగుల అట్టడుగు స్థాయికి పడిపోయిన పాలేరు నీటిమట్టం మరో రెండు రోజుల్లో 10 అడుగుల వరకు చేరుతుందని అధికారులు చెబుతున్నారు. పాలేరుకు సాగర్ నుంచి ఎక్కడా ట్యాంపరింగ్‌లు లేకుండా 2 టీఎంసీల నీటిని తీసుకోగలిగితేనే వేసవి తాగునీటి గండం నుంచి బయటపడే అవకాశం ఉంది. లేదంటి మళ్లీ మరో నెల రోజుల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యే ప్రమాదమూ లేకపోలేదు.

# దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న బీజేపీని ఓడించాలి

- రేపు తుక్కుగూడలో కాంగ్రెస్ జనగర్జన సభ
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

ఖమ్మం, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కుల, మత, వర్గాల పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఓడించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయమైన నగరంలోని సంజీవరెడ్డి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం తుక్కుగూడ జరుగనున్న జనగర్జన సభ దేశానికి దిశా నిర్దేశం చేయనుందన్నారు. లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోను తుక్కుగూడ సభ నుంచే ఏఐసీసీ నాయకత్వం ప్రకటించనుందని తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ఏకైక దిక్కు కాంగ్రెస్ మాత్రమేనని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తుక్కుగూడ సభ నుంచే ఏఐసీసీ నేతలు ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంకగాంధీలు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలకు దేశమే ఆశ్చర్యపోయిందని అన్నారు. కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అమల్లోకి తెచ్చామన్నారు. మూడు నెలల్లోనే 64.75 లక్షల మంది రైతులకు రైతుబంధు మొత్తాన్ని జమ చేశామన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందజేస్తున్నామని, 2030-31 వరకు పీక్ డిమాండ్‌ను అందుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. మూడు నెలల్లోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. తుక్కుగూడ సభకు ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు, వరంగల్ నుంచి మహబూబ్‌నగర్ వరకు కదలి రావాలని కోరారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు జావీద్, మహిళా నేత దొబ్బల సౌజన్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క